క్లుప్తంగా

పంచాగం ఆవిష్కరణ



పంచాగం, క్యాలెండర్‌లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: దూప, దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన తెలుగు క్యాలెండర్, పంచాగాన్ని మంగళవారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శోభకృత్ నామ సంవత్సరంలో అందరికి మంచి జరగాలని కోరారు. ఉగాది పండుగ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జంగా సుబ్రమణేశ్వరశర్మ, జాయింట్ సెక్రటరీ రామానుజాచార్యులు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌శర్మ, ప్రధాన కార్యదర్శి రమేష్, ప్రవీణ్‌కుమార్‌శర్మ, రాఘవేంద్రశర్మ, జగ్గయ్య శర్మ, రామాచారి, జంగం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ నాప్కిన్ వెండింగ్ మిషన్ ఏర్పాటు



వెండింగ్ మిషన్‌ను ఉపాధ్యాయినులకు అందజేస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి

చేవెళ్ల: పాఠశాలలో విద్యార్థినుల సమస్యలకు చక్కటి పరిష్కార మార్గాన్ని గుర్తించి దానిని అమలు చేసేందుకు చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి ముందుకు రావడం సంతోషకరమని ఎంపీపీ విజయలక్ష్మి అన్నారు. మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం సీతారెడ్డి సహకారంతో అందించిన శానిటర్ నాప్కిన్ వెండింగ్ మిషన్‌ను పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ.. మహిళలు తమ జీవితకాలంలో ఎదుర్కొనే ప్రధాన సమస్య రుతుస్రావం(పీరియడ్స్)పై పూర్తిస్థాయిలో పాఠశాల స్థాయి నుంచే అవగాహన కలిగి ఉండాలనే ఆలోచనతో ఇలాంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు శానిటరీ నాప్కిన్ వెండింగ్ మిషన్‌లను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. పాఠశాలలో ఈ మిషన్ ఏర్పాటు చేసి ఉపాధ్యాయురాళ్లకు, విద్యార్థినులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. నిజంగా ఇలాంటి నిర్ణయం తీసుకున్న సీతారెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

కౌన్సిలర్ మహేశ్వరి



బోరుమోటారు ప్రారంభిస్తున్న కౌన్సిలర్ మహేశ్వరి

షాద్‌నగర్: మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు కౌన్సిలర్ కొందూటి మహేశ్వరి తెలిపారు. మంగళవారం పట్టణంలోని 20వ వార్డు పటేల్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన బోరు మోటారును మహేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎంతో కాలంగా పట్టణంలో ప్రజలు మంచినీటి సమస్యలు ఎదుర్కొనేవారని తెలిపారు. అయితే, ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకంతో ఇంటింటా నల్లా ద్వారా మంచినీటిని సరఫరా చేస్తుందన్నారు. వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌వర్మ, గోపాల్, వహీద్, మన్నె రవి పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే అభివృద్ధి సాధ్యం

బీఎస్పీ నాయకుడు శ్రీనివాస్

షాద్‌నగర్‌రూరల్: బడుగు బలహీన వర్గాలు రాజ్యాధికారాన్ని సాధించినప్పుడే అభివృద్ధి సాధ్యమని బహుజన సమాజ్‌పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు దొడ్డిశ్రీనివాస్ అన్నారు. బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను అమలు చేయాలని కోరుతూ ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గ్రామంలో మంగళవారం బీఎస్పీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో 52శాతానికి పైగా ఉన్న బీసీ జనాభా లెక్కలు తీయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో తీరని అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కుమార్, ఆంజనేయులు, జయప్రకాష్, మహేందర్, రమేష్, కుమార్, చెన్నయ్య, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులెందుకు..
ఆమ్యామ్యాలు ఇస్తే సరి..

- యథేచ్ఛగా పరిశ్రమల నిర్మాణం
- ప్రభుత్వ ఆదాయానికి గండి..
- పట్టించుకోని పాలకులు..అధికారులు



నందిగామ బైపాస్ రహదారికి అతి సమీపంలో వ్యవసాయ భూమిలో వెలసిన పరిశ్రమ

నందిగామ: లక్షలాది రూపాయలను ఖర్చు పెట్టి అనుమతులు తీసుకునేందుకు సమయం వృథా అవుతోంది.. ఇదంతా అవసరమా..అధికారులతో పాటు, కొంత మంది ప్రజాప్రతినిధులను మచ్చిక చేసుకుంటే చాలు ఇక అడిగే వారు ఎవరు? అనుకుంటున్నారో ఏమో తెలియదు గానీ.. ఎలాంటి అనుమతులు లేకుండా నందిగామ మండలంలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న పరిశ్రమలను చూస్తే నిజమే అనిపిస్తోంది.. వివరాల్లోకి వెళ్లితే.. తహసీల్దార్ కార్యాలయానికి కూత వేటు దూరంలో.. బైపాస్ రహదారికి అతి సమీపంలో వ్యవసాయ భూమిలో సర్వే నం.547లో సుమారు 3 ఎకరాల్లో ఓ పరిశ్రమను నిర్మించారు.. ఈ పరిశ్రమ నిర్మాణానికి సంబంధిత అధికారుల నుంచి ఏ మాత్రం అనుమతులు లేవు. కనీసం వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా కూడా మార్చుకోలేదు. ఈ పరిశ్రమ తమ ఉత్పత్తులను గత కొంత కాలంగా కొనసాగిస్తున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. ఈ విషయం అటు పాలకులకు గానీ, ఇటు సంబంధిత అధికారులకు గానీ తెలియకుండా జరిగిపోయిందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటి వరకు అటు పాలకులు, సంబంధిత అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడంలో అంతర్యామేమిటనే ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి. నర్సప్పగూడ గ్రామ శివారులో సైతం ఓ పరిశ్రమ యాజమాన్యం పరిశ్రమ నిర్మాణానికి కొంత మేరకు అనుమతులు తీసుకొని మిగతా షెడ్లకు ఎలాంటి అనుమతులు లేకుండా ఏకంగా మూడు పెద్ద గోదాంలనే నిర్మించారు. అంతేకాకుండా అదే గ్రామంలో నర్సప్పగూడ నుంచి చేగూరుకు వెళ్లే రహదారిలో మరో పరిశ్రమను నిర్మించారు. ఈ పరిశ్రమలకు ఎలాంటి అనుమతులు లేవు. వీటితో పాటు మండల కేంద్రమైన నందిగామ పరిసర ప్రాంతాల్లో జంగోనిగూడలో సైతం లెడ్డు పరిశ్రమలు అనేకం వెలుస్తున్నాయి.

మండలంలో అనేకం..

పై రెండు గ్రామాల్లోనే కాకుండా మండలంలోని పలు గ్రామాల్లో ఇలాంటి పరిశ్రమలు అనేకం ఉన్నాయి. అధికారులు ఇలాంటి పరిశ్రమలపై తగు విచారణ చేపట్టినట్లయితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

అధికారులు ఏం చేస్తున్నట్లు..

ఎలాంటి అనుమతులు లేకుండా కొంత మంది పారిశ్రామికవేత్తలు ఏకంగా వ్యవసాయ భూముల్లోనే పరిశ్రమలను స్థాపిస్తుండగా, మరికొంత మంది వ్యవసాయేతర భూముల్లో నిర్మించినా కూడా ఎలాంటి అనుమతులు తీసుకోవడం లేదు. అటు రెవెన్యూ అధికారులు గానీ, ఇటు గ్రామ పంచాయతీలు గానీ, హెచ్ఎండీఏ అధికారులు గానీ, పరిశ్రమల శాఖలు గానీ ఏమాత్రం పట్టించుకోకపోవడంతోనే అక్రమార్కులు రెచ్చిపోతుండడంతో ప్రభుత్వానికి ఆదాయానికి పెద్ద ఎత్తున గండిపడుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అనుమతులు లేని పరిశ్రమలపై తగు చర్యలు తీసుకొని ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడకుండా చూడాల్సిన అవసరం ఎంతైన ఉంది.

" నోటీసులు జారీ చేస్తాం..



మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ భూముల్లో అనుమతులు లేకుండా వెలసిన పరిశ్రమల వివరాలు సేకరిస్తాం. వ్యవసాయ భూమిలో నందిగామ శివారులో నిర్మించిన పరిశ్రమ యాజమాన్యానికి నోటీసులు జారీ చేస్తాం. అనుమతులు లేవని తెలిస్తే తగు చర్యలు తీసుకుంటాం. వ్యవసాయేతర భూమిగా మార్చుకోకుండానే పరిశ్రమలు నిర్మించినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

– రహ్మాన్ ఖాన్, తహసీల్దార్, నందిగామ మండలం

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి

సంఘం మండల అధ్యక్షుడు రాజు



కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న నాయకులు

నందిగామ: ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలని ముదిరాజ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మేకం రాజు ముదిరాజ్ అన్నారు. మండల పరిధిలోని బుగ్గోనిగూడలో మంగళవారం ముదిరాజ్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజు ముదిరాజ్ హాజరయ్యారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బుగ్గ మల్లేష్, ఉపాధ్యక్షుడుగా శంకర్, ప్రధాన కార్యదర్శిగా పాండు, కోశాధికారిగా వెంకటయ్య, కార్యదర్శిగా రమేష్, యువత కమిటీ అధ్యక్షుడిగా శివశంకర్, ఉపాధ్యక్షుడిగా అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్, కోశాధికారిగా అశోక్ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

అంతిరెడ్డిగూడలో..

అంతిరెడ్డిగూడలో ముదిరాజ్ సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా శ్రీశైలం, ఉపాధ్యక్షుడిగా అంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా రమేష్, కార్యదర్శిగా ప్రవీణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కొమరబండ ఉత్సవాలు



బుగ్గరామేశ్వరస్వామి దేవాలయం

దేవాదాయ–ధర్మాదాయ శాఖ ఈఓ శ్రీనివాస్, సర్పంచ్ చంద్రశేఖర్

షాబాద్: నేటి నుంచి కొమరబండ బుగ్గరామేశ్వర స్వామి దేవాలయ ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని దేవాదాయ–ధర్మాదాయ శాఖ ఈఓ శ్రీనివాస్, సర్పంచ్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. మండల పరిధిలోని కొమరబండ దేవాలయంలో ఈనెల 22న ధ్వజారోహణం, 23న రుద్రాభిషేకం, 24న అగ్ని గుండ, 25న సేవ, 26న రథోత్సవం, 27న పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, 28న శివనామస్మరణ, 29న దీపోత్సవం, 30న శివతీర్థం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే యాదయ్య, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ హాజరుకానున్నారు.

భూమిపై నీరులేనిది జీవం లేదు

ఉపాధ్యాయుడు నరేంద్ర బోగం

చేవెళ్ల: సమస్త జీవకోటికి ప్రాణాధారం నీరు. నీరు లేనది జీవం లేదని ప్రాణి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని ఉపాధ్యాయుడు, పర్యావరణ వేత్త నరేంద్ర భోగం అన్నారు. మండలంలోని కందవాడ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. నీటిని పొదుపు చేసుకోవాలని నినాదాలు చేశారు. పాఠశాల ఆవరణలో వర్షపు నీటి సంరక్షణ, నీటి పొదుపు గురించి ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి నీటి బొట్టు విలువ అందరికి తెలియాలన్నారు. చిన్నప్పటి నుంచే నీటి సంరక్షణ, నీటి విలువ తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయకుమార్, మరణా రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్ కోసమే బీఆర్ఎస్

ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

షాబాద్: బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలు, నాయకులే పట్టుగొమ్మలని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని మన్‌మర్రి గ్రామంలో 10 గ్రామ పంచాయతీల పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసి, శ్రేణుల్లో ఉత్తేజం నింపేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేలా కార్యకర్తలే ప్రధాన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారన్నారు. ఇప్పటి నుంచే నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. దేశంలోనే తెలంగాణ అభివృద్ధిలో అగ్రస్థానంలో ఉందని తెలిపారు. జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ...తెలంగాణ వస్తే ఏం అభివృద్ధి సాధిస్తుందని అన్న వాళ్లకు సీఎం కేసీఆర్ అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి చూపించారని కొనియాడారు. చందనవెల్లి, సీతారంపూర్ పరిశ్రమల్లో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఇపిస్తామన్నారు. షాబాద్ మండలాన్ని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రతి గ్రామానికి రోడ్లు, మురుగు కాల్వలు, బ్రిడ్జిల పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, మాజీ చైర్మన్లు వెంకటయ్య, శ్రీనివాస్‌గౌడ్, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మొయినాబాద్ బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, సహకార సంఘం వైస్ చైర్మన్ మల్లేష్, డైరెక్టర్ నర్సింహులుగౌడ్, పార్టీ సీనియర్ నాయకులు శ్రీరాంరెడ్డి, అరీఫ్, బండ నర్సింహారెడ్డి, పాండురంగారావు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

డిప్యూటీ డీఎం హెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి



ఉపకేంద్రాన్ని పరిశీలిస్తున్న జయలక్ష్మి

కొందుర్గు: గర్భిణులకు, పసిపిల్లలకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి సూచించారు. మంగళవారం ఆమె చౌదరిగూడ ఉపకేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యాధి నిరోధక టీకాల రిజిస్టర్ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వ్యాధి నిరోధక టీకాలకు సంబంధించిన పసిపిల్లల వివరాలను నమోదు చేసుకొని వారిని ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి సోమవారం, గురువారం టీకాలు వేయనున్నట్లు అవగాహన కల్పించాలన్నారు. ప్రతిరోజు ఏఎన్ఎంలు, ఆశలు ఉపకేంద్రంలో అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ అమ్రిత జోసెఫ్, ఎంపీడీఓ మహేష్‌బాబు, హెల్త్ ఎడ్యూకేటర్ శ్రీనివాసులు, ఎంపీహెచ్ఈఓ ప్రభులింగం, పీహెచ్ఎన్ లుదియా, ఏఎన్ఎం సరళ పాల్గొన్నారు.

పోలీసుల తీరుపై న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

చేవెళ్ల: న్యాయవాది సత్యనారాయణపై ఘట్‌కేసర్ పోలీసుల దురుసు ప్రవర్తనను న్యాయవాదుల అసోషియేషన్ తీవ్రంగా ఖండిస్తుందని చేవెళ్ల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బక్కరెడ్డి యాదిరెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు కాంప్లెక్స్‌లో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోలీసుల తీరు రోజురోజుకు విచిత్రంగా మారుతుందన్నారు. సివిల్ కేసుల్లో పోలీసుల జోక్యం ఉండకూడదని చెప్పినా కలుగజేసుకుంటూ న్యాయవాదులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. న్యాయవాది సత్యనారాయణపై ఘట్‌కేసర్ పోలీసుల తీరుపై న్యాయవాదుల అసోషియేషన్ రాష్ట్ర వ్యాప్తంగా స్పందించిందని ఇలాంటి సంఘటనలు మరోసారి జరగకుండా ఉండాలంటే దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు రవిశంకర్‌గౌడ్, బాలస్వామి, మల్లేశ్, తాజుద్దీన్, జనార్దన్, మల్లేశం, మహేశ్, శ్రీనివాస్, గౌతమ్‌రెడ్డి, వెంకటేశ్, యాదగిరి, తదితరులు ఉన్నారు.

మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం



వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

మొయినాబాద్: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మొయినాబాద్ బైపాస్‌కు సేకరించిన భూమికి ప్రస్తుత మార్కెట్ విలువకు మూడు రెట్లు నష్టపరిహారం ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేశారు. మంగళవారం ప్లాట్లు కోల్పోతున్న బాధితులు మండల తహసీల్దార్ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం భూసేకరణ చేస్తూ 2018 మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం ఇవ్వడం సరికాదన్నారు. నష్టపరిహారం ఇవ్వడంలో అధికారులు సరైన పద్ధతి అవలంబించడం లేదని.. కనీసం తమకు ఇప్పటి వరకు నోటీసులు ఇవ్వకుండా ప్లాట్లును చదునుచేసి రోడ్డు పనులు చేపడుతున్నారన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రస్తుత మార్కెట్ విలువకు మూడు రెట్లు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఈ విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ బాధితులకు హామీ ఇచ్చారు.

పండుగలు సంప్రదాయానికి ప్రతీక

జేవీవీ డివిజన్ అధ్యక్షుడు కుర్మయ్య

షాద్‌నగర్‌రూరల్: పండుగలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని జనవిజ్ఞాన వేదిక(జేవీవీ)డివిజన్ అధ్యక్షుడు కుర్మయ్య అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని జియోన్ ఎయిడెడ్ పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉగాది పచ్చడిని అందజేశారు. ఈ సందర్భంగా కుర్మయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు మన భారతదేశ సంస్కృతి సంప్రదాయాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మనం జరుపుకొనే ఒక్కో పండుగ ఒక్కొక్క విశిష్టతను కలిగి ఉంటుందని చెప్పారు. శీతాకాలం తరువాత వేసవి కాలంలోకి అడుగు పెట్టే సమయంలో మనకు ఉగాది పండుగ వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జియోన్ ఎయిడెడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి, రామసత్యనారాయణ, జేవీవీ డివిజన్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్‌రజాక్, కోశాధికారి నర్సింలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

సీపీఎం నాయకుడు దేవేందర్

చేవెళ్ల: గత నాలుగు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు రాష్ట్రంలో 5 లక్షల ఎకరాల్లో ధాన్యం, మొక్కజొన్న, జొన్న, పసుపు, కూరగాయ పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని సీపీఎం చేవెళ్ల డివిజన్ ఇన్‌చార్జి అల్లి దేవేందర్ అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. వడగళ్ల వానతో రైతులకు పెద్ద ఎత్తున నష్టం జరిగిందన్నారు. ప్రభుత్వం నష్టపోయిన ప్రతి ఎకరానికి రూ.20వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జరిగిన నష్టంపై ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసి పరిశీలనకు ప్రత్యేక టీమ్‌లను పంపించాలని కోరారు. ఈ వర్షాలకు పేదల ఇళ్లు కూడా కూలిపోయాయని వివరించారు. ఇళ్లు కూలిపోయిన బాధితులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులు, ప్రజలు అకాల వర్షాలకు నష్టపోయి బాధల్లో ఉంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి

శంకర్‌పల్లి: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అదిరోహించాలని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 15వ వార్డు అయ్యప్పరెడ్డిగూడ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు, స్టేషనరీ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే మంచి నడవడికను అలవర్చుకోవాలని సూచించారు. కాగా, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

టాటా మ్యాజిక్ ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు బీస సాయిబాబ



ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని అలవర్చుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని టాటా మ్యాజిక్ ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు బీససాయిబాబ పేర్కొన్నారు. శంషాబాద్ మండలం పెద్దతూప్రకు చెందిన కుమార్ షాద్‌నగర్‌లో నివసిస్తూ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 9న రోడ్డుపై నిలిపిన కుమార్‌కు చెందిన టాటాఎస్ ఆటో అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధమయింది. ఈ సందర్భంగా మంగళవారం టాటా మ్యాజిక్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బాధితుడు కుమార్‌కు 10వేల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం బీససాయిబాబ మాట్లాడుతూ.. జీవితంలో మనం ఎంత సంపాధించామనేది ముఖ్యం కాదని, మనవంతు ఇతరులకు ఎంత సేవ చేశామనేది ప్రధానమన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు మల్లేష్, ఉపాధ్యక్షుడు హైమద్, ట్రెజరర్ అజ్జు, పాష, శ్రీశైలం, అనీఫ్, నవాజ్, లక్ష్మణ్, రవి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వంద మంది విద్యార్థులు గైర్హాజరు

షాద్‌నగర్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మంగళవారం గణితం, బాటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలు జరిగాయి. షాద్‌నగర్‌లోని ఏడు పరీక్షా కేంద్రాల్లో 2247 మంది విద్యార్థులకు గాను 2147 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 100 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 418మంది విద్యార్థులకు 403మంది, మొగిలిగిద్ద ప్రభుత్వ కళాశాలలో 181మంది విద్యార్థులకు 177మంది, ప్రతిభ కళాశాలలో 338 మందికి 324మంది, విశ్వభారతీ కళాశాలలో 319మందికి 307 మంది, విజ్ఞాన్ కళాశాలలో 418మందికి 399మంది, విజేత కళాశాలలో 338 మందికి 315మంది, శ్రీసాయి ఒకేషనల్ కళాశాలలో 235మందికి గాను 22 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఇంటర్ పరీక్షల కస్టోడియన్ అధికారులు శ్రీకాంత్, కిష్టప్పలు తెలిపారు.